క్లుప్తంగా

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



దుంపగడపలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆకివీడు: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ సభ్యురాలు మోరా జ్యోతి రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడపలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు తమ అమూల్యమైన సమయాన్ని వైద్య శిబిరాలకు కేటాయిస్తున్నారని చెప్పారు. ఆసుపత్రులకు వెళ్లలేని రోగుల లోపాలను శిబిరాల్లో బయటపెట్టే అవకాశం ఉందన్నారు. కంటి పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవడం ద్వారా చత్వారం, శుక్లాలు, ఇతర కంటి రోగాల పట్ల అప్రమత్తంగా ఉండొచ్చని చెప్పారు. వైద్య శిబిరంలో సుమారు 152 మందికి పైగా వైద్య పరీక్షలను నిర్వహించారని వారిలో 24 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించినట్లు, 16 మందికి కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించినట్లు చెప్పారన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు పిన్నమరాజు మురళీకృష్ణంరాజు, దాట్ల రామరాజు, గోపాలరాజు, కెఎల్.నర్సింహరాజు, బలరామరాజు, వైద్యులు పి.కృష్ణ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తి

వీరవాసరం: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్, హృదయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పెర్కిపాలెం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ శాసనసభ్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవపై అంకితభావంతో పని చేస్తున్న యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ను అభినందించారు. క్యాన్సర్, దంత, కంటికి, చర్మ వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. జక్కంపూడి రంగారావు, నూకల ధనుంజయ్, పెనుమాక రామ్మోహనరావు, జక్కంపూడి మధన్, వీరుకొండ దుర్గా ప్రసాద్, శిరిగినీడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

భీమవరం: తాడేరులో అర్హత కలిగిన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం ఎస్.అప్పలనాయుడు అధ్యక్షతన తాడేరు సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ భీమవరం కు ఆనుకొని ఉన్న తాడేరు గ్రామంలో ప్రజలకుస్వచ్ఛమైన మంచినీళ్లు అందించడంలో పాలకవర్గాలు విఫలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీను ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా గోందు జనార్దన్‌రావు, కమిటీ సభ్యులుగా శీలబోయిన భద్రం, ఎస్.అప్పలనాయుడు, జి.రాము, సింహాచలం, ఆల్తి అప్పలనాయుడు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎం.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

భీమవరం: భీమవరం బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్‌లో పనిచేస్తున ఒకవ్యక్తి ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తి కడప జిల్లాకు చెందిన ఎ.శ్రీనివాస్‌గా స్థానికులు చెబుతున్నారు. మృతుడు కొంత కాలంగా టి.బి వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందాలి

పెంటపాడు: దేవుని ఆధ్యాత్మిక జ్ఞానం పొందాలని యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ మండల అధ్యక్షుడు డీఆర్‌కే మోజెస్ అన్నారు. మీనవిల్లూరు పాస్టర్ కృష్ణ చర్చిలో మూడు రోజుల ఉపవాస ఆశీర్వాద పండుగలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. మోజెస్ ప్రారంభ ప్రార్థన చేశారు. ఆధ్యాత్మికంగా తనను వెంబడించే వారికి యేసు క్రీస్తు నిత్యం తోడుంటారని వివరించారు. ఆయన ద్వారానే క్షమ, దయ, శాంత స్వభావం అలవడుతాయని తెలిపారు. చర్చి పాస్టర్ మహేష్‌పాల్, రేణులు స్తుతి ఆరాధన చేశారు. మంగళవారం రాత్రి వరకు కొనసాగే సభల్లో ప్రముఖ దైవసేవకులు జి.రక్షణానందం, జీజే జ్యోతి ఆనంద్, సీహెచ్ మోజెస్, పాలా ఆశీర్వాదం తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సభలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రహదారులకు మోక్షమెప్పుడో..?



పెదకాపవరంలో రిటర్నింగ్ వాల్ నిర్మించి రోడ్డు నిర్మాణం మరిచిన దృశ్యం



గుంతలమయమైన పెదకాపవరం-బావాయిపాలెం రహదారి

- నిధులున్నా.. పనులు సున్నా!
- ఆర్అండ్‌బీ శాఖ నిర్లక్ష్యంపై గ్రామస్తుల మండిపాటు

ఆకివీడు : కేంద్ర రోడ్డు నిధులు (సీఆర్ఎఫ్) నిధులు మంజూరయ్యి, టెండర్లు పూర్తయినా ఆ రోడ్లకు మోక్షం లభిచడం లేదు. పేదల ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించినా రోడ్డు పనులు ప్రారంభించ లేదు. నిధులున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆ నిధులు ఎప్పుడు ఆవిరైపోతాయోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆ రహదారులపై ప్రయాణించాలంటే నరకం చూస్తున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని పెదకాపవరంలో గత ఏడాది డిసెంబర్‌లో సుమారు రూ.72 కోట్లు కేంద్ర రహదారుల నిధులు(సీఆర్ఎఫ్) మంజూరు అయ్యాయి. పెదకాపవరం నుంచి బావాయిపాలెం వరకూ సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర కొల్లేరు పంట కాలువకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం, రహదారి నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరు అయ్యాయి. అప్పట్లో రహదారుల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. భారీ రిటర్నింగ్ వాల్ నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. అదే సమయంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉండగా భారీ వర్షాలకు పనులు ప్రారంభించ లేదు. నేటికీ పనులు ప్రారంభించకపోవడతో రహదారి గుంతల మయమయ్యింది. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రహదారిపై వందలాది మంది వ్యాపారులు, చేపలు, రొయ్యల చెరువుదారులు, రైతులు నిత్యం ప్రయాణిస్తుంటారు. గణపవరం, తాడేపల్లిగూడెం పట్టణానికి దగ్గర మార్గంగా ఉండటంతో ఈ రహదారినే ప్రజలు, వ్యాపారులు ఎంచుకుంటున్నారు. రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 50 కోట్ల పనులు ప్రారంభించ లేదు

ఉండి మండలం పాములపర్రు నుంచి పెదకాపవరం శివారు గంటల రాయుడు పేట వరకూ రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణ పనులకు రూ.25 కోట్లు, ఆకివీడు నుంచి చినమిల్లిపాడు వరకూ రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణ పనులకు రూ.25 కోట్లు కేంద్ర రోడ్డు నిధులు (సీఆర్ఎఫ్) మంజూరయ్యాయి. ఎన్నికల ముందు రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం పెదకాపవరం నుంచి గంటల రాయుడు పేట వరకూ రోడ్డు ఆక్రమణలో ఉన్న ఇళ్లను తొలగించారు. ఆక్రమణదారులు గడువివ్వాలని మొరపెట్టుకున్నా, రోడ్డు విస్తరణ పనులకు ఇబ్బంది ఏర్పడుతుందని ఇళ్ల తొలగింపు జరిగినా పనులు ప్రారంభించ లేదని ప్రజలు వాపోతున్నారు. ఆకివీడు నుంచి సిద్ధాపురం, కాళింగగూడెం మీదుగా కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు వరకూ రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో నిధులు మురుగుపోతాయనే ఆందోళనలో ఆ ప్రాంత ప్రజలున్నారు. ఈ రహదారి గుండా ఆరు గ్రామాలకు చెందిన రైతులు, చేపలు, రొయ్యల రైతులు, ప్రతీ రోజూ రాకపోకలు జరుపుతుంటారు. మేత, సీడ్, మందులు, రొయ్యల, చేపల పట్టుబడులు, ఎఫ్‌సీఐ ప్రవేటు గొడౌన్ ద్వారా బియ్యం దిగుమతులు, ఎగుమతులు నిర్వహిస్తారు. రహదారి విస్తరణ పనులు చేపట్టడం ద్వారా వాహనాల రాకపోకలకు వీలు కలుగుతుందని సీఆర్ఎఫ్ నిధులను వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్రఅసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

పైపులైన్ లీకేజీలను అరికట్టాలి

- వృథాగా పోతున్న కుళాయి నీరు
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది



పైపు లీక్ అవ్వడంతో బురదమయంగా మారిన రోడ్డు

పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో పాడిదారి వీధిలో మంచినీటి పైపులు లీకవుతున్నా పంచాయతీ అధికారులు గానీ, సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదు. దీంతో ఆ వీధి నీటితో నిండి పోయి, బురద మయంగా మారుతోంది. స్థానికులు గత్యంతరం లేక ఆ బురద నీటిలోనే సంచరిస్తున్నారు. జిల్లా స్థాయి పంచాయతీ ఉన్నతాధికారులు కూత వేటు దూరంలోనే ఉన్నప్పటికీ, పంచాయతీ సిబ్బంది గానీ అధికారులు గానీ విధులు నిర్వహించడంలో అలసత్వం చూపుతున్నారు. ఇటీవలే గాంధీ జయంతి పురస్కరించుకొని నెల రోజులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలాంటి దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కాళ్ల: సుమారు 17 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు జువ్వలపాలెం హైస్కూల్ వేదికైంది. 2007-08 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలిశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, వరలక్ష్మి, పుష్పలత, సీతాదేవి, జ్యోతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరంలో వైహెచ్ఏఐ కొరల్‌జూబ్లీ వేడుకలు



వైహెచ్ఏఐ ఉత్సవాల నిర్వహణకు సాయం అందిస్తున్న సోమరాజు

భీమవరం: యూత్‌హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్ఏఐ) భీమవరం యూనిట్ కొరల్‌జూబ్లీ(35 ఏళ్ల) వేడుకలు డిసెంబర్ 14, 15 తేదిల్లో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం (త్యాగరాజు భవనం)లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాస్ చెప్పారు. ఉత్సవాల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించిన సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వైహెచ్ఏఐ నేషనల్ చైర్మన్ మనోజ్ జోరి వేడుకలను ప్రారంభిస్తారని, కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్రానికి చెందిన యువజన, టూరిజం శాఖల మంత్రులు పాల్గొంటారన్నారు. ఈ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పర్యావరణ-పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ, విజ్ఞాన యాత్రలు, ఎకో టూరిజం వంటి అంశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 99123 22269 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు డాక్టర్ సోమరాజు రూ. 20 వేలు అందించారు. సమావేశంలో మట్లపూడి సత్యనారాయణ, కట్రెడ్డి సత్యనారాయణ, బోనం పాండురంగరావు, తాళ్లపూడి గాంధీ, కటికరెడ్డి వెంకటరత్నం పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

భీమవరం: కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకోవడం దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరం శాఖ వరద బాధితుల సహాయార్థం రూ.2.68లక్షల సహాయాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్లు నడింపల్లి శంకర్ కుమార్ వర్మ, గొట్టుముక్కల బాలకృష్ణంరాజు, యువీ రామణరాజు, మేళం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్టు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని నర్సయ్య అగ్రహారం పేకాటస్థావరంపై దాడిచేసి 12 మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు ఆదివారం చెప్పారు. నర్సయ్య అగ్రహారంలోని ఇంటిలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా డబ్బుతో కోతబండి పేకాడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,430 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు చెప్పారు.

ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణలు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ దసరా నవరాత్రి మహోత్సవాల్లో ఆదివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శిమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిషనర్ మహాలక్ష్మీ నగేష్, ఆలయ అధికారులు,అర్చకులు పాల్గొన్నారు.అలాగూ నాచువారి సెంటర్‌లోని శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి దేవినవరాత్రి మహోత్సవాలను ఒంటిద్దుబళ్ల సంఘం వారు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని ఆదివారం గాయత్రీదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరిలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా భీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న మహిషాసురమర్దని అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ తోట శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గాయత్రి దేవిగా నాచువారి సెంటర్‌లోని కనకదుర్గమ్మ



ఉండి: లలితా త్రిపుర సుందరీదేవిగా కనకదుర్గమ్మ

మార్మోగిన అమ్మవారి నామస్మరణ

కాళ్ల: కోమటిగుంట గ్రామం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని కాళ్ల మండలం కోమటిగుంటలో వేంచేసియున్న విజయ కనకదుర్గమ్మ 40వ వార్షికోత్సవం సందర్భంగా బోనాల సంబరాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 108 మంది మహిళా భక్తులు ప్రత్యేక అలంకరణలో, భవానీ మాలదారులు నెత్తిన బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల గ్రామోత్సవం కార్యక్రమంలో భవానీ మాలధారులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.



ఆకివీడు: లలితా త్రిపుర సుందరీదేవిగా పెద్దింట్లమ్మ



అన్నపూర్ణాదేవి అలంకరణలో మహిషాసురమర్దని అమ్మవారు



కాళ్ల: గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సంతానలక్ష్మిగా శ్రీలక్ష్మి

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 4వ రోజు ఆదివారం సంతానలక్ష్మిగా శ్రీలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఏలూరు జిల్లా తాడినాడ వాస్తవ్యులు నంబూరి గజపతిరాజు, వాణి దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమపూజలు, అష్టోత్తర శతనామార్చన, ఆలయ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు.

లలితాత్రిపుర సుందరీదేవిగా పెద్దింట్లమ్మ

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాలు, ప్రత్యేక మండపాల్లో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవి అలకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రాజరాజేశ్వరీ సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో, మాదివాడలోని అమ్మవార్ల ఆలయంలో గంగానమ్మ ఆలయంలో, రైల్వే గేటు వద్ద వేంచేసియున్న కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని త్రిపురా సుందరిగా అలంకరించారు.

లలిత త్రిపురసుందరీ దేవిగా దుర్గమ్మ

ఉండి: లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. దసరా పర్వదినాల్లో భాగంగా ఆదివారం దుర్గమ్మ అమ్మవారు అన్ని ఆలయాల్లోనూ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. మండల వ్యాప్తంగా దసరా ఉత్సవాలు నిర్వహించడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పలు ఆలయాల్లో సహస్రనామార్చన, కుంకుమ పూజలు నిర్వహించారు.

ప్రాణాలతో సెల్‌గాటం

- సెల్‌ఫోన్ మాట్లాడుతూ యథేచ్ఛగా డ్రైవింగ్
- పోలీసుల ప్రత్యేక నిఘా



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: సెల్‌ఫోన్ అనేది నేడు ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమైన వస్తువుగా మారింది. అది లేకపోతే కాలుబయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జేబులో డబ్బులు పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్ ఉంటే చాలనే పరిస్థితికి వచ్చింది. ప్రయాణం, షాపింగ్, భోజనం, సినిమా, విహారం, వినోదం, ఆర్థిక లావాదేవీలన్నీ క్షణాల్లో చేయవచ్చు. ఫోన్ ఉంటే చాలు ప్రపంచమంతా మన చేతిలోనే ఉంటుంది. ఇంత ముఖ్యమైన సెల్‌ఫోన్‌ను విచ్చలవిడిగా వాడడం వల్ల లేనిపోని ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా మంది మోటారు సైకిళ్లపై ప్రయాణిస్తూ సెల్ ఫోన్ మాట్లాడుతూ కనిపిస్తున్నారు. భుజానికి, చెవికి మధ్య ఫోన్ పెట్టుకుని మాట్లాడుతకుంటూ వెళ్లిపోతుంటారు. ఇది నిబంధనలకు విరుద్ధమని పోలీసులు ఎన్నిసార్లు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

అనేక ప్రమాదాలు

సెల్‌ఫోన్ లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపడం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు వాహన చోదకులు మృత్యువాత పడుతున్నారు. ఇంకొన్ని సందర్భాల్లో ఎదురుగా వచ్చే వారిని ఢీకొంటున్నారు. సెల్‌ఫోన్‌కి కాల్ వచ్చినప్పుడు రోడ్డు పక్కన బండి ఆపి, మాట్లాకుంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ ఆ విషయాన్ని కొందరు అస్సలు పట్టించుకోవడం లేదు. చెవికి, భుజానికి మధ్యలో సెల్ నొక్కిపెట్టి దృష్టి ఎక్కడో పెట్టి వాహనాలకు నడుపుతున్నారు. ఈ సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకు గురై మంచాన పడుతున్నారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలకు సెల్ డ్రైవింగ్ ప్రధాన కారణం అవుతోంది. ఇలాంటి ప్రమాదాల నివారించడానికి పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై నిఘా పెట్టారు. భీమవ రం పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1012 సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. వీటి నుంచి రూ.10.12 లక్షల జరిమానా వసూలు చేశారు.

యువతే ఎక్కువ

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడుతున్న వారిలో యువతే అధికంగా ఉంటున్నారు. వీరిలో విద్యార్థులు ఎక్కువగా ఉండడం గమనార్హం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని వేగంగా నడపడం వల్ల అనేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ విధంగానే వీరవాసం ఎక్కువ మంది విద్యార్థులు సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ ప్రయాణాలు సాగిస్తున్నారు.

చాలా ప్రమాదకరం



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరం. దీనివల్ల ఫోన్ మాట్లాడే వారితో పాటు ఎదురుగా వస్తున్న వాహన చోదకులు కూడా ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుంది. డ్రైవింగ్‌లో ఫోన్ వస్తే రోడ్డుపక్కగా వెళ్లి వాహనాన్ని నిలిపి మాట్లాడుకోవాలి. ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారిపై నిఘా పెట్టాం.

– కృష్ణాజీ, వీరవాసరం ఎస్సై

10 నుంచి యువజన సభలు

ఉండి: ఈ నెల 10 నుంచి 12 వరకు ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ యూత్ ఆధ్వర్యంలో 26వ యువజన శాంతి సహవాస కూడికలు నిర్వహిస్తున్నట్లు యూత్ కమిటీ ప్రతినిధులు తెలిపారు.